సాలెకొంపలో స్మశానం!

ఇమంది రామారావు

సుశీల అద్దం ముందు నుంచింది.

తన రూపం వెక్కిరిస్తూ నవ్వుతుంది. మొహంమీద చిందరవందరగా తన బ్రతుకులాగా చెదిరిపోయింది జుత్తు. ప్రయత్నంమీద కళ్ళు తెరవాలనుకుంది. కాని కళ్ళు మండుతున్నై. బరువుగా మూతలు పడుతున్నై. రాత్రి తెల్లవార్లూ నిద్రలేదు. ఎవరో కాలేజీ స్టూడెంట్సట బుక్ చేసుకున్నారు. ఒక్క క్షణం ఊపిరిపీల్చుకోనివ్వలేదు.

"సుశీ!"

"ఏమ్మా....!" అంటూ తిరిగిచూసింది. ఎదురుగా సత్యవతి కిళ్ళీ నములుతూ పెదవుల్ని నాలుకతో తడుపుకొంటూ నవ్వుతూంది. సుశీల దగ్గరికి నడిచింది. సుశీల గుండె వేగంగా కొట్టుకుంటుంది. టైమ్ చూసింది. గుండాగినంత పనయింది. అయిదు గంటలయింది. మళ్ళీ డ్యూటీకి ఎటెండ్ అవ్వవలసిన సమయం దగ్గరపడింది. ఈ రోజు ఎలాంటి కాంట్రాక్టు ఒప్పుకుందో సత్యవతి.

"టిఫిను చేశావామ్మా!" అంది సత్యవతి ప్రక్కనున్న స్టూలుని లాక్కొంటూ కూర్చుంటూ.

"లేదమ్మా.... చేయాలనిపించలేదు!" అంటూ సిగముడి వేసుకుంది.

"అదేమిటి సుశీ! ఎంచక్కా జారుజడ వేసుకుని క్లిప్పులు పెట్టుకుంటే ఎంత బావుంటావు!" అంటూ మెటికలు విరిచింది.

సుశీల నవ్వింది. ఆ నవ్వులో జీవంలేదు. నిర్లిప్తంగా వుంది. విరాగిని విడిచే నిట్టూర్పులాగా వుంది.

రంగమ్మ టిఫిను తీసుకొచ్చింది. ప్లేటునిండా బ్రెడ్ రోస్టు డబుల్ ఆమ్లెట్, చికెన్ పులుసు, ఎగ్ పూడింగ్ వుంది—అమ్మవారికి మొక్కినపుడు కోడిముందు పల్లెటూర్లలో యిప్పటికీ నాలుగు పిండివంటల్తో కుంభంపెట్టి తినిపిస్తారు. తినకపోతే బలవంతంగా గొంతులో కుక్కుతారు. మరుసటి క్షణంలో ఒకే వ్రేటున గొంతు తెగకోస్తారు. యింకా అది నయమనిపించింది సుశీలకి. ఒకేసారి ప్రాణం పోతుంది. ఎందుకీ కులట బ్రతుకు? ఎంతకాలం ఛస్తూ బ్రతకాలి? మెదడు వేడెక్కిపోయింది. నరాలు చిట్లిపోతాయేమో భయంగా వుంది.

"తినమ్మా!" అంటూ సుతారంగా తల నిమిరింది సత్యవతి.

"అమ్మా! ఈ రోజు నాకు వంట్లో ఏం బాగోలేదమ్మా. పొత్తి కడుపు నెప్పిగావుంది. యిపుడు నేనేం చేయలేను!" అంది టిఫినుతోబాటు రాత్రి కూడా వదిలి పెట్టమన్న కోరిక వ్యక్తపరుస్తూ—

"డాక్టరుని పిలవమంటావా?" అంది సత్యవతి.

"వొద్దమ్మా.... ఈ రోజు నన్ను విడిచి పెట్టెయ్....

కంటినిండా నిద్ర కరువయ్యింది. గత వారం రోజులుగా ఒంట్లో అస్సలేం బాగోలేదు. ఈ ఒక్క రోజు వదిలెయ్!" అంటూండగా సత్యవతి మొహంలో మారే రంగుల్ని చూసి ఆగిపోయింది.

"సుశీ! గోపాల్రావుగారు వస్తున్నారు! అటుపైన నీ యిష్టం. క్రిందటిసారి వచ్చినపుడు కుదరదని పంపించాము. యిపుడు ఆయనతో మనకి పనివుంది. ప్రాణంతో సమానమైన కార్యం ఆయన చేతులమీదుగా జరగాల్సివుంది. నిన్ను తప్ప యింకెవర్నీ అడగడు—ఆయన పైత్యం ఆయంది. నీ పైత్యం నీది. మీమీద వేలవేలు తగలబెట్టి చేతులు కాల్చుకొని నాశనమయిపోయాను మధ్యలో నేను" స్టూలు ఒక మూలకు వెళ్ళేలా కాలితో తన్నింది.

అదే మనిషికి తగిలితే అవుట్-సుశీల వచ్చేకొత్తలో తన దగ్గరవున్న అమ్మాయిలు తన మాట వినకపోతే యిలాగే తన్నేది. ఒకసారి సుశీలని కూడా తన్నింది. పొట్ట చిట్లిపోయిందేమో అనిపించింది. ప్రేవులు మెలికలు పడ్డాయి. సుశీల లేచి నిలబడింది. అలా కాలితో తన్నించుకొనే బదులు ఎవరో ఒకరి చేతుల్లో నలిగి చావడం మంచిదనుకొంది. వేడి నిట్టూర్పు విడిచింది.

2

"ఏం చెప్పమంటారు గోపాల్రావుగారూ! వంటినంటి పెట్టుకొని వున్న వంద తులాల బంగారం అమ్మేసి ఈ అమ్మాయిల వ్యాపారంలో దిగేను. నిండా మునిగి పోయాను. మీకు అమావస్యకి పున్నమికి తప్ప మా యిల్లు గుర్తురాదు. ఏం చెప్పమంటారు నా నరకయాతన గురించి. పోనీ యింట్లో అమ్మాయిలుంటారా....ఒక్క పిల్ల ఆరోగ్యంగా లేదు. అందరికీ నాకంటే నీరసం

ముంచుకొచ్చింది. ఏ ముండయినా నా యింటికొచ్చినప్పుడు చెంగు చెంగుమంటూ ఎగురుకొస్తారు. ఈ మట్టి పారం ఏమిటో మరి. నెలరోజులు తిరక్కుండా చలాకీ, గిలాకీ అంతా పోయి ముసలిపీనుగులయిపోతారు!" తిట్టుకుంది సత్యవతి.

గోపాల్రావు త్రిబుల్ ఫైవ్ సిగరెట్ తీసి వెలిగించాడు. గుప్పు గుప్పుమంటూ పొగలు కక్కుతూ నవ్వుతున్న కళ్ళతో అలాగే చూస్తున్నాడు.

"ఏమిటి గోపాల్రావుగారూ మాట్లాడరు. మీ ద్వారా నాకో చిన్న సహాయం కావాలి! మీరు చేయకపోతే మరుసటి రోజుకి నా శవాన్నే చూస్తారు మీరు. ఆ.... మాయదారి గోల! నేను ఛస్తే ఏడ్చే దిక్కెవరంట. ఊరికి రోగం కుదిరిందని సంబరం చేసుకుంటారు. దిక్కుమాల్ని దాన్ని. ఎందుకు బతుకుతున్నానో నాకే తెలీదు. అసలు చావంటే నాకు భయమేడిసింది. లేకపోతే ఈసరికి బాదంకాయలు నూరుకొని తాగి చచ్చేదాన్ని!" కళ్ళు అద్దుకుంది.

మరో సిగరెట్ వెలిగించాడు.

"గోపాల్రావుగారూ! అదిగో ఎదురుగా కనిపిస్తున్న నా పరువుమీద ప్రమాణంచేసి చెప్తున్నాను. మీరు నన్ను కాపాడాలి. మీరే నన్ను కాపాడగలరు!" ప్రతిమాలుతూ దగ్గరికి వచ్చింది.

సిగరెట్ సగం పారేశాడు. పొగ సత్యవతి మొహం మీద విడిచిపెట్టాడు.

సత్యవతి కళ్ళల్లోకి పొగపోయింది. కళ్ళు మంట పుడుతున్నా నవ్వుతూ "నిజంగా గోపాల్రావుగారూ యింతమందిని చూశానుగాని మీలా సిగరెట్స్ యింత

స్పీడుగా కాల్చేవారిని, యింత అందంగా పొగ వదిలే వారిని యింతవరకూ చూడలేదనుకోండి!" అంది.

"ఎంతమందిని చూశావ్!"

"అబ్బో ... వేలు ... లక్షలు!"

"అంటే నీ సంపాదన కోట్లమీద వుండాలే!"

"పాయింటు పట్టేశారు గోపాల్రావుగారూ. మాట వరుసకి వందలు వేలు అంటాం నిజంగా జరుగుతుందా?" అంటూ చిలిపిగా తన తొందరపాటుకి నాలుక్కొరుచుకుంది.

"సుశీల ఎక్కడ?" మరో సిగరెట్ వెలిగింది.

"గదిలో వుంది!"

"ఏ గదిలో?"

"మేడమీద గదిలో బాబూ!"

"నేను వస్తున్నట్టు చెప్పావా!"

"లక్షసార్లు చెప్పేను!"

గోపాల్రావు ఆమె మొహంలోకి మరోసారి సూటిగా చూశాడు. "నీలాంటోళ్ళే ఇండియాలో 'స్టెటిస్టిక్స్' చెప్తుంది!" అన్నాడు లేస్తూ. సత్యవతి కూడా లేచింది. గోపాల్రావు పోలిస్టర్ లాల్చీ చేతుల్ని దగ్గరికి మడిచాడు. నీళ్ళు నములుతుంది సత్యవతి. మేడ మెట్లుకేసి దారి తీశాడు.

"గోపాల్రావుగారు నేను చెప్పింది వినకుండా...."

"ఉదయం చెప్పు! నీ రా మా య ణ ం" అన్నాడు కేర్ లెస్ గా.

"మరి రాత్రికి మీకు వంట చేయొద్దూ!" అంది.

జేబులోంచి రెండువందల రూపాయల నోట్లిచ్చాడు. కళ్ళ కద్దుకుంది. మరో నాలుగు మెట్లెక్కాడు.

"గోపాల్రావుగారూ! ఈ రోజు పదో తారీఖు. యింటద్దె క్రిందటి నెల పంపిస్తానన్నారు పంపించలేదు. ఈ నెల ఒకటి దాటి తొమ్మిది రోజులయింది. ఒక మూడువందలుంటే కనీసం అప్పుగానైనా సరే యిప్పించండి."

గోపాల్రావు ఒకసారి సత్యవతి మొహంలోకి చూశాడు. మరో మూడు వందరూపాయల నోట్లు తీసి యిచ్చాడు. మళ్ళా కళ్ళకద్దుకుంది. "ఈ ఊర్లో మీరు తప్ప మాకు దిక్కెవరు చెప్పండి. నీళ్ళముంచినా పాల ముంచినా మీదే భారం" అంటూ వంట గదిలోకి నడిచింది సత్యవతి అంగలేస్తూ.

3

రాత్రి మూడు గంటలయింది.

సిగరెట్స్ ఖాళీ అయ్యాయి.

సుశీల మగత నిద్రలోకి జారుకుంది. ఒంటిమీద నూలుపోగులేదు. గుండెలమీద తొడలమీద రక్తపు జీరలున్నై.

గోపాలం పందిరి మంచంకేసి చూస్తూ ఆలోచనల్లోకి జారుకున్నాడు.

'కెవ్వు'మంటూ కేక వినిపించడమూ, క్రింద ఏదో మోటర్ బైక్ స్టార్టవ్వడమూ ఒకేసారి జరిగాయ్.

గోపాల్రావ్ తృళ్ళిపడి లేచాడు. క్రిందకి పరుగుతీశాడు.

సత్యవతి గుండె బాదుకొని ఏడుస్తోంది.

"ఏం సత్యవతీ ఏమయ్యింది!" గోపాల్రావు అడిగాడు.

"మన రాధమ్మ... మన రాధమ్మ.... మన రాధమ్మ-" అంటూ మిగతా విషయం చెప్పలేకపోయింది.

సుశీలకు మెలకువ వచ్చింది. లంగా చుట్టుకొంటూ

క్రిందికి దిగింది.

"ఏం పిన్నీ....ఏమయ్యిందీ!" భుజాలు పట్టి కుదుపుతూ అడిగింది. లక్ష్మి కూజాలో మంచినీళ్ళు గ్లాసులోకి వొంపి తీసుకొచ్చి సత్యవతి మొహంమీద చల్లింది.

సత్యవతి తేరుకుంది. మళ్ళీ ఏడుపు మొదలుపెట్టింది.

"రాధమ్మని ఎవడో దొంగసచ్చినోడు చంపేశాడే తల్లీ!" అంటూ మంచినీళ్ళు గుటగుటా తాగింది.

రాధ శవాన్ని బయటికి మోసుకొచ్చారు గోపాల్రావు, లక్ష్మి తోడుపట్టుకొంటూ—

"గోపాల్రావుగారూ! మీతో ఒక ముఖ్యమైన విషయం చెప్తానన్నా నా....యిదే బాబూ! ఎవడో పనికి మాలిన సన్నాసి ఇన్స్పెక్టర్ సచ్చినోడు మా యింటికి వచ్చాడు. రాధని తనతో బయటికి పంపించమని అడిగాడు. అలా బయటికి పంపించడానికి కుదరదని చెప్పేను. పట్టుపట్టాడు. నేను వినిపించుకోలేదు. ఒకటి రెండుసార్లు వచ్చాడు. మన సుశీల దగ్గర లక్ష్మి దగ్గర, నా దగ్గర కూడా రెండు మూడుసార్లుండి వెళ్ళాడు.

యింతలో ఏం ముంచుకొచ్చిందో నా సంపాదనలో పాతిక భాగం వాడికి కావాలన్నాడు. నేను కుదరదని ఖచ్చితంగా చెప్పేశాను. పోనీ సుశీలని వుంచుకుంటా నన్నాడు. అదీ కుదరదన్నాను. పెద్దపెద్దోరి హయాంలో వుంది. బయటోళ్ళకి తిరగదన్నాను. చూడు—నిన్నేం చేస్తానో. నీ యింటిని స్మశానం చేస్తాను. నిన్ను నాశనం చేస్తానని బెదిరించాడు. అలాగే చేశాడు. నా కొంప స్మశానమయిపోయింది బాబో. యిదుగో యివ్వాళొక శవం, రేపొక శవం, ఎల్లుండొక శవం. ఈ యిల్లు స్మశానమే బాబోయ్!" అంటూ గొంతుచించుకొని ఏడు

న్నూంది.

"పిన్నీ ఊరుకో! బయట నలుగురికీ తెలిస్తే అరా తీస్తారు. పైగా అళ్ళు పోలీసులు. కేసుపెట్టి, మనమీదకి ఎక్కడలేని నేరాలు రుద్దుతారు. యిప్పుడు జరగవల సిందాని గురించి ఆలోచించడం మంచిది!" అంది సుశీల.

"సరే ఈ శవాన్ని ఎవరికీ కనపడనీయకుండా మా పొలంలో పాతిపెట్టండి. ఈ యింట్లో హత్య జరిగినట్లు ఎవరికీ తెలీదు. నేను మీకు యింతకంటే ఏం సహాయం చేయలేను!" అన్నాడు.

"సరే బాబూ! మా పరువు బజారుపాలుపోకుండా కడుపులో పెట్టుకో. కోర్టెక్కినోడు, గాడిదెక్కినోడు ఒకటంటారు. ఈ పరిస్థితిలో నేను కోర్టులు చుట్టూ తిరగలేను!" దణ్ణం పెట్టింది.

నిముషాలమీద గోపాలావు పాలేర్లు వచ్చారు. తెల్లారేసరికి అంతా పూర్తయింది. ఎవరికీ ఏం తెలియనట్లు ఆరుగంటలయినా మంచాలమీదనుండి లేవకుండా నిద్ర పోతున్నారు.

4

"హలో" రిసీవర్ ఎత్తాడు అనదుగుల విగ్రహం.

"బన్ టౌను పోలీసు స్టేషనా!" అవతలి గొంతు.

"య్యెస్ ప్లీజ్!"

"రాంప్రసాద్ గారున్నారా?"

"స్పీకింగ్!" అన్నాడు.

రాంప్రసాద్ మాట్లాడుతుంటే హెడ్ కనిస్టేబుల్ కోటిలింగం అలా మొహంలోకి చూస్తూ వుండిపోతాడు. రైటర్ విశ్వనాథం కూడా చెప్పవాల్చాడు. ఒకరా యిద్దరా స్టేషనంతా కళ్ళుచేసుకొని రాంప్రసాద్ ప్రతి

చర్యనీ గమనిస్తుంది.

"నేను మీతో పర్సనల్ గా మాట్లాడాలి.... కలుసు కోవచ్చా!" ప్రశ్నించింది ఆవతలిగొంతు.

"ష్యూర్ .... ష్యూర్!"

"ఎక్కడ కలుసుకుందాం?"

"ఎక్కడయినా మీ యిష్టం!"

"మీకు రెస్ట్రిక్షన్స్ ఏం లేవుగా!"

"పోలీసు డిపార్ట్ మెంట్ లో నియమాలే వుంటే— ఒకరికి రక్షణ కల్పించడానికి ఏమైనా చేయొచ్చు!"

"మీరు నా దగ్గరికి వచ్చింది 'రక్షణ' కల్పించడానికి కాదు. పార్టీలో పార్టిసిపేట్ చేయడానికి.... వస్తున్నారా?"

"నన్ను మీకు తెలుసా!"

"తెలుసు! మీరు రండి. నేను చెప్పిన విషయాలు వింటే మీరు ఎగిరి గంతేస్తారు. కౌగలించుకుంటారు. రాత్రంతా నా దగ్గరే వుంటారు. అసలు యిల్లు కదలరు. నిజం."

"సరే. యింకో అరగంటలో నా డ్యూటీ అయిపోతుంది. నేను బయలుదేరి వస్తున్నాను. ఎడ్రసు చెప్పండి" అంటూ పెన్సిలు కాగితంమీద సిద్ధంగా వుంచాడు.

"మీకు బొమ్మూరు తెల్సా!"

"తెలుసు!"

"గోపాల్రావుగారి రెస్టు హౌస్ అంటే ఎవరయినా చెప్తారు!"

"ఒ.కే!" అంటూ ఫోను పెట్టేశాడు ఇన్స్పెక్టర్ రాంప్రసాద్.

మరో గంట తర్వాత మఫ్టీలో గోపాల్రావుగారి గెస్టు హౌస్ కి బయలుదేరాడు.

"వెల్ మిస్టర్ రాంప్రసాద్! వెల్ కమ్!" అంటూ సాదరంగా ఆహ్వానించాడు గోపాల్రావ్.

గెస్టు హౌస్ చాలా అందంగా వుంది. రాంప్రసాద్ రాజమండ్రిలో గత అయిదేళ్ళుగా వుంటున్నప్పటికి బొమ్మూరులో గెస్టుహౌస్ ని చూసే అవకాశం ఒక్కసారి కూడా కలుగలేదు. ఎక్కడలేని శిల్ప సంపద, అక్కడే చోటుచేసుకుంది. రకరకాల మాడ్రన్ ఆయిలు పెయిటింగ్స్ వున్నై.

"ఏవిటి చుట్టూ పట్టిపట్టి చూస్తున్నారు. ఏం గుర్తుకు రావడంలేదా—" అన్నాడు గోపాల్రావు, కల్యాణి బీర్ ఓపెన్ చేస్తూ.

"ఊఁ చెప్పండి!" ముందుకు జరిగాడు.

"వ్చ్.... చెప్పవల్సిందేం లేదు—చేయవలసిందే! టేక్ దిస్" బీరుబాటిల్ అందించాడు.

"నో థాంక్స్!" ద్రాక్షరసం తీసుకున్నాడు.

"నేనూ మొదట్లో అంటే హయ్యర్ సెకండరీవరకూ చదూకొంటున్న రోజుల వరకూ తీసుకోనేవాడ్ని కాను. కాని భీముని పట్నంలో రాంప్రసాద్ అనే ఒక ఫ్రెండు గాడిద సెన్సు 'బి'లో తగిలాడు. కలిసింది ఒక సంవత్సరమే అయినా ఒకే ప్రాణంగా కలిసిపోయాం. ఒక రోజు అంటే అది మాకు స్కాలర్ షిప్ వచ్చినరోజు. సెన్సు ఫస్టు క్లాసులో పేసయిన రోజు. చేతినిండా డబ్బులున్న రోజు. మనసు పట్టపగ్గాలేకుండా పరవశించి ఉరకలేస్తున్న రోజు. రెండు బీరు బాటిల్స్ కొన్నాం. నర్సింహస్వామి కొండెక్కిపోయాం చెరో బాటిలు తీసు

కున్నాం. ఒకరి పేరు మరొకరు స్మరిస్తూ అరనిముషంలో బాటిలు గడగడా లేదనిపించాం.

తర్వాత ఆ అడ్డగాడిద రాంగాడు నానుండి వేరయి పోయాడు.

వాళ్ళ నాన్నగారిక్కి ట్రాన్స్ఫర్ అయిందని తెలిసింది. వెళ్ళిన ఒకటి రెండు నెలలు వుత్తరాలు రాశాడు. తరువాత వాడి అంతు చిక్కలేదు. నాకు పెళ్ళయింది. ఆ వెధవకి పెళ్ళయిందో, లేదో?

ఒరేయ్, నన్నింకా గుర్తించలేదట్రా! నేను గోపిని! నీ గోపినిరా!" అంటూ గుండెకేసి హత్తుకున్నాడు. రాంప్రసాద్ కళ్ళనిండా గతం నిండిపోయింది. ఏదో అనూహ్యమయిన అనుభూతి.

"గోపీ!" అంటూ నుదురు ముద్దు పెట్టుకున్నాడు.

గోపాల్రావ్ డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరున్న ఒక బజర్ నొక్కాడు. ఒక సర్వెంట్ వచ్చాడు. యాష్ ట్రేలు రెండు, రెండు ట్రిబుల్ ఫయివ్ సిగరెట్ పేకెట్స్ తెచ్చాడు. క్షణంలో రెండు సిగరెట్స్ గుప్ మంటూ వెలిగాయి.

రెండో బజర్ నొక్కాడు.

అయిదు నిముషాలు ఏ విధమయినటువంటి రెస్పాన్స్ లేదు.

రాంప్రసాద్కిదంతా ఆశ్చర్యంగా కనిపించింది.

"నువ్వేం బిజినెస్ చేస్తున్నావ్రా!"

"అడిగేవ్రా. పోలీసులకు అభిమానాలకంటే అనుమానమే ముందు పుడుతుందంటారు అందుకేరా. ఎనీవే నాకు చాలా మంచి బిజినెస్ వుంది. ముందు నువ్వు ఏ బిజినెస్ చేస్తున్నావో చెప్పు!" అనడిగాడు గోపి.

"నేను బిజినెస్ చేయడమేంట్రా! ఐయామ్ ఎ పోలీస్ ఆఫీసర్! నేనొక ఇన్స్పెక్టర్ని!"

"ఆ విషయం తెలుసులేవోయ్. ఈనాడు దోపిడీలు, దొంగతనాలు, దారికాపులూ, రేప్ లూ ఇలాంటి అత్యాచారులు చేయాలంటే ఈ ప్రపంచం మొత్తానికి ఒక పోలీసు మెన్ కి తప్ప మరొకరికి దమ్ములేవు. ప్రపంచంలో నడుపబడుతున్న వ్యభిచార కొంపలు అత్యధికంగా పోలీసు అధికార వర్గం యాజమాన్యంతో నడపబడుతున్నవే— తప్పులేదు.

సైడు బిజినెస్ గా ఏదో వొకటి లేకపోతే వచ్చే వెయ్యి పదిహేనువందల్తో మెంటయిన్ అవ్వొద్దూ. అవున్రా. నీకెందరు పిల్లలు!" వర్షం వచ్చినట్లు మాట్లాడాడు.

గోపి సహజంగా ఎక్కువగా మాట్లాడే మనిషి కాడు. యింత చనువుగా మాట్లాడే మనిషి కాడు. ఎంత మారి పోయాడు.

"అరేయ్ గోపీ! నేను 'హాపీగా' వున్నాను. నాకీ వుద్యోగం ద్వారా వచ్చిన డబ్బుతో నా ఫేమిలీ పోషించుకోలేకపోతే, ఈ వుద్యోగాన్ని రిజైన్ చేసి మరో లాభసాటి వ్యాపారాన్ని చూసుకుంటాను. ఆ తెలివి తేటలు నాకున్నాయి. అయినా నాకు పదిమంది పిల్లలేరు. నేనూ, నా మదర్, నా మిస్సెస్, బాబు యింతే. నలుగురికీ యింటద్దెతో వెయ్యి రూపాయలు చాలు! నాకు ఇతర అలవాట్లు లేవు. ఒకవేళ అలాంటి ఆర్థికపరమైన సమస్యలొస్తే వున్నావు కదరా ఆప్త మిత్రుడివి. నిన్నే అడుగుతాను! సరేనా!" అన్నాడు ప్రామిస్ చేస్తూ.

గోపాల్రావ్ ముఖంలో రంగులు మారాయి.

"రాం...నువ్వు నా 'రాం' వేరా! పోలీసాఫీసరువైనా నువ్వు ఏమాత్రం మారలేదు. స్నేహం కోసం ప్రాణాలివ్వడానికైనా సిద్ధపడతావని మరోసారి రుజువుచేశావు. రాంప్రసాద్! స్నేహంకోసం చెబుతున్నాను. నువ్వు ఈ ఊర్లో ఉండకు! ట్రాన్స్‌ఫర్ చేయించుకో! నీకు అవసరమనిపిస్తే హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయ్యేలా చూస్తాను. నువ్వు మాత్రం ఎంత వేగిరం షిఫ్ట్ అయితే అంత మంచిది నీకూ, నాకూ!" అన్నాడు మరో ట్రిబుల్ ఫైవ్ వెలిగిస్తూ.

"ఎందుకని?"

"ఏమిటి? ఎందుకూ? అని ప్రశ్నించకు. నామీద నీకే మాత్రమైన ప్రేమవుంటే నేను చెప్పినట్లు చెయ్యి!" అన్నాడు గోపి సిగరెట్ రెండు దమ్ములులాగి యాష్ ట్రేలో విడిచిపెడుతూ.

"ఇట్సాల్ రైట్ - యింకేవిట్రా కబుర్లు!" అంటూ వీపుమీద ముద్దుగా చరిచాడు రాంప్రసాద్. అలా ఒకరొన్నొకరు పసిపిల్లాల్లా కొట్టుకొని ఎన్నాళ్ళయిందో.

"నువ్వే చెప్పాలి. ఈ వారంలో ఎన్ని హత్యలు జరిగాయో!" గోపి మరో సిగరెట్ ముట్టించాడు. రాంప్రసాద్ కూడా కంపెనీ ఇచ్చాడు.

"గోపీ! నువ్వు ఘండుగా రమ్మన్నావు. నువ్వెంత ఘండు అన్నది నీ దగ్గరకొచ్చాక, నీ కథంతా తెలుసుకున్నతర్వాత తెలిసింది. లెటజ్ డిస్పర్స్ హాపిలీ. వస్తాను!" అంటూ లేచాడు.

"నో....నో....రోమా వుంది. ఈ రోజే వచ్చింది పెద్దాపురంనుండి. భలే ఖుషీగా మాట్లాడుతుంది. నీ

గురించే తెప్పించాను. ఎంజాయ్....”

“నో.... థాంక్స్!” అని బయటికి నడిచాడు రాం ప్రసాద్.

గోపాల్రావుకు నోట మాట పెగల్లేదు.

5

మర్నాడు లక్ష్మి హత్య చేయబడింది ఆ ఇంట్లో-పెద్దగా ఏడ్చింది సత్యవతి.

సుశీలకి దుఃఖం ఆగింది కాదు.

“అమ్మా!” అంటూ సత్యవతి గుండెల్లో చోటు చేసుకుంది. ఉదయం ఏడు గంటలు. బయట జన సందోహం తిరుగుతున్నారు.

“అమ్మా సుశీలా! మన గోపాల్రావుగారికి ఫోను చెయ్యమ్మా.... ఆయనొస్తేగాని మనకి ఏ విషయమూ తెలీదు!” అంటూ తనే ఫోను దగ్గరికెళ్ళి స్వయంగా డయల్ చేసింది.

గోపాల్రావు లేడు. వారం రోజులు తరువాత వస్తాడని తెలిసింది.

“సూర్యం!” అంటూ గట్టిగా అరిచింది. పెరటి గుమ్మంలో గుర్రుపెట్టి నిద్రపోతున్న సూర్యాం ఉలిక్కిపడి లేచాడు. పరుగున వచ్చాడు.

“రాత్రి నువ్వు మెలకువగా వున్నావా?”

“వున్నానమ్మగోరూ!”

“ఎంతవరకూ?”

“తెల్లవార్లూ!”

“మనింట్లోకి ఎవరెవరు వచ్చారు?”

“అమ్మో.... వేలు ... లక్షలు!”

“ఛీఛీ వెధవ, ఎవరొచ్చారో చెప్పు!”

"పేర్లు తెలుస్తాయేటండీ — ఆ పొడుగాటాయన వొచ్చాడండి మోటర్ సైకిల్ మీద. యింకెవరో అంబాసిడర్ కారులో మార్వాడీ అనుకుంటానండీ ఆయ నొచ్చారండీ. అంతేనండీ!" అన్నాడు యీసగా.

"పుష్పా!" అని పిలిచింది.

పుష్ప ఓ మూలనుండి పరుగు పరుగున వచ్చింది.

"ఏమ్మా!" అంది భయంగా.

"లక్ష్మి గదిలోకి వెళ్ళింది ఎవరో చూశావా?"

"చూశానక్కా. పేరు తెలీదు. పొడుగ్గా, ఎర్రగా మంచి పర్సనాలిటీగా వుంటాడు. 'టక్' చేశాడు" అంది పోలికల్ని నెమరువేసుకుంటూ.

"టక్.... చేసుకున్నాడా? ఏ బెల్టు కట్టాడు?"

"ఆర్! అనే ఇంగ్లీషు లెటరువుంది. నల్లటి వెడల్పాటి బెల్టు!"

"రాంప్రసాద్ కదూ!"

"కరెక్టు....కరెక్టు! చాలాసేపు నవ్వులు వినిపించాయి. 'రాం' 'రాం' అని లక్ష్మి రెండు మూడుసార్లు అనడం చూశాను."

"మరెలా చనిపోయిందని తెలిసింది!" కంగారుగా అడిగింది.

"నాకు రెండో ఆట సినిమా విడిచిపెట్టాక బేరం వొచ్చింది. గది అవసరమయింది. ఎంతసేపటికీ తలుపు తియ్యాదు. తలుపు తట్టాను. అయినా తలుపు తియ్యలేదు. ప్రాణం విసిగిపోయింది. కిటికీలోంచి చూశాను. పెరడు వేపు తలుపులు తీసివున్నై. లక్ష్మి వొంటిమీద చీరలేదు. నేలమీద స్పృహలేకుండా పడిపోయివుంది. పట్టి

కుదిపాను. లక్ష్మి చనిపోయిందని తెలిసింది!" అంటూ మళ్ళీ బావురుమంది పుష్ప.

సుశీల గుండె ఝల్లుమంది.

"ఏమిటి-లక్ష్మికి హంతకుడికీ మధ్య చనువుగా పిలుచుకొనేంత పరిచయం వుందా?" ఆశ్చర్యపోయింది.

6

"నమస్కారమండీ!" అంది సత్యవతి.

డి.యస్.పి. వరప్రసాదరావు సత్యవతి మొహంలోకి ఆశ్చర్యంగా చూశాడు.

"నేను రాజమండ్రిలోనే వుంటున్నానండీ. తమరు కోప్పడకుండా వింటానంటే కొన్ని విషయాలు మనవి చేసుకోవాలని వచ్చానండీ" అంది చేతులు కట్టుకుంటూ వినయంగా.

"ఒ.క.... చెప్పు!" అన్నాడు తాపీగా గాలి విడిచి.

"ఇన్స్పెక్టర్ రాంప్రసాద్ బాబు మీకు తెలుసాండీ!"

వరప్రసాదరావు భ్రుకుటి ముడిపడింది.

"ఏమిటి విషయం చెప్పు!"

"ఆయన మా ఇంటికి వస్తూంటారు" నేల చూపులు చూస్తూ అంది.

"ఏం....మీ యింటికి ఎవరూ రాకూడదా?" చిరుకోపంతో ప్రశ్నించాడు.

"తమరు అలా కోప్పడితే మిగతా వివరాలు చెపుతానండీ. నేను నలుగురు అమ్మాయిల్ని పెట్టుకొని సంపాదించుకుంటున్నాను. నా పొట్టగడవక నేను యిలాంటి నీచవృత్తి చేస్తున్నాను. నాకు తెలుసు సంఘంలో నాలాంటి వాళ్ళకు గౌరవం వుండదనీ, అసహ్యించు

వుంటారని - మాకు ఈ ప్రపంచంలో బద్ద విరోధులు పోలీసులు ...."

వరప్రసాదరావు క్షణం అచేతనంగా వుండిపోయాడు. నిజాన్ని ఎంత నిర్భయంగా చెబుతుంది. ఆమెపట్ల ఆమె నిజాయితీపట్ల నమ్మకం కలుగుతోంది.

"ఊ...." అంటూ చెప్పమన్నట్లు ముందుకు జరిగాడు.

"ఒక ఇన్స్పెక్టరయివుండి మా యింటికొచ్చి మా ఇంట్లోవున్న అమ్మాయిల్తో సంబంధం పెట్టుకున్నాడు- షోనీ ఏదో కక్కుర్తిపడ్డారు. అతనూ అందరిలాంటి మగవాడేకదా అనుకున్నాను. వయసులోవున్న అందమయిన అమ్మాయిల్ని వాడుకున్నంతకాలం వాడుకొని పీకపిసికి చంపేస్తున్నాడు. ఇలా రెండు హత్యలు చేశాడు. ఇక ముందు ముందు ఏం చేస్తాడో భయంగా వుంది" అంది సత్యవతి.

వరప్రసాదరావుకి ఏం అర్థంకాలేదు.

"ఎవర్ని గురించి మీరు చెబుతున్నారు?" అడిగాడు.

"ఇంకెవరు బాబూ .... మీ ఇన్స్పెక్టర్ రాం ప్రసాద్ గార్ని గురించే" అంది-

షాక్ తిన్నాడు వరప్రసాదరావు! స్పేసు తల క్రిందులుగా గిర్రున తిరుగుతున్నట్లనిపించింది.

"నువు చెప్పిందానికి సరైన సాక్ష్యాలూ, ఆధారాలూ వున్నాయా? నిజం రుజువు చేయగలవా?" గద్దించి అడిగాడు.

"మా ఇంటికి రండి అయ్యగారు. నిజం ఏమిటో తెలుస్తుంది."

"ఈ విషయంలో ఏమాత్రం తేడా వచ్చినా నిన్ను అరెస్టు చేయడమేకాకుండా, కఠినంగా శిక్షించవలసిన

పరిస్థితి ఏర్పడుతుంది" అని హెచ్చరించాడు.

"నా తల తీయించండి-ఇకముందు నా ఇంట్లో మరో 'హత్య' జరక్కుండా కాపాడితే చాలు. అదే పదివేలు!" అంది.

"సరే పద!" అంటూ ఓ జీపులో కూర్చున్నాడు డి.ఎస్.పి.

7

"ఇదుగో బాబూ! ఈ అమ్మాయి సునంద, ఈ అమ్మాయి పుష్ప. ఈ అమ్మాయి సుశీల. ఇదుగో! ఈ అమ్మాయి విషయంలోనే పేచీ పెట్టుకున్నారు రాం ప్రసాద్ గారు. ఆయన కోరినపుడు ఈ అమ్మాయికి వీలుకాక ఒప్పుకోలేదని శపథం చేశాడు ఇల్లు స్మశానం చేస్తానని-అందుకే మొదటిసారి రాధమ్మను చంపేడు. రెండోసారి లక్ష్మిని చంపేడు. మూడవసారి నేనే మిగిలి పోయాను" అంది జీరబోయిన గొంతుతో.

"మీ ఇంట్లో హత్య జరిగినట్లు పోలీసులకి ఎందుకు తెలియపర్చలేదు?"

"భయపడి!"

"ఎవరికి భయపడి?"

"పోలీసు డిపార్టుమెంటుకి భయపడి."

"ఇపుడెందుకు రిపోర్టుచేశావ్!"

"మాకు రక్షణ కావాలి! అందుకోసం-మీకు రిపోర్టు చేయకపోవడం మా నేరం. ఒప్పుకుంటున్నాం. కాని ఆయనగారి 'గురి'నుండి మమ్మల్ని తప్పించాలి!" ప్రాధేయ పడుతూ కాళ్ళు పట్టుకోబోయింది.

"ఈ రెండు హత్యలు జరిగినపుడు ఎవరెవరు దగ్గ రున్నారు?"

"నేనే బాబూ.... నాతోబాటు రెండవ హత్య జరిగినపుడు పుష్ప కూడా దగ్గరుంది. ఏమేవ్" అంది.

అవునన్నట్లు తలూపింది పుష్ప. సునంద కూడా తలూపింది.

"రాంప్రసాద్ తరచూ మీ ఇంటికి వస్తుంటాడా?"

"ఆ..." అంది సుశీల కల్పించుకొని.

"నీకూ రాంప్రసాద్‌కి బాగా చనువుందా?"

"చనువని మెల్లగా అడుగుతారేం బాబూ. ఈ ఇంట్లో రెండు శాలీలు పోవడానికి కారణం ఈ...." తిట్టాలనుకొని ఆపుచేసుకుంది. సుశీల తల దించుకుంది.

"నిన్ను ప్రేమించానని చెప్పేడా?"

"లేదు. నేనంటే ఇష్టమని తెలుసు?"

"హత్య జరిగినపుడు నువ్వెక్కడున్నావ్?"

"కావాలనే అడుగుతున్నారా డి. యస్. పి. గారు బజారు మనుషులు ఎక్కడుంటారు. బజారులో వుంటారు" అంది బాధగా.

వరప్రసాదరావు సుశీల ముఖంలోకి పరీక్షగా చూశాడు. సుశీల కళ్ళలో గిర్రున నీరు తిరిగింది. బొట బొట రాలిపోయింది. ప్రయత్నంమీద దుఃఖాన్ని ఆపుకొంటుంది.

"రాంప్రసాద్ ఎలా వుంటాడు పోలికలు చెప్పండి."

"పోలికలు సరిగ్గా చెప్పలేను. నాకు మొదటిరోజు పరిచయమైనపుడు నన్ను కావాలని కోరుకున్నపుడు నాకో లెటరు రాశారు. అందులో ఫోటో జతచేసి పంపించారు. వుండండి చూపిస్తాను!" బీరువా తలుపులు తీసి అడుగునవున్న కవరు తీసి అందించింది.

ఫోటో చూశాడు వరప్రసాదరావు.

గుండె ఆగివంత పనయింది.

"రాం.....ప్రసాద్!" స్వగతంగా అనుకున్నాడు. లెటరు చదివేడు మనసులో.

"సుశీలా!

నువ్వు నచ్చావు. నిన్ను అనుభవించాలను కున్నాను. ఆ అవకాశం ఇవ్వలేదు. ఆల్ రైట్ జీవితంలో కళ్ళకు కనిపించిన అందాలన్ని నా స్వంతం చేసుకోవాలనే దీక్ష నాది! నన్ను తప్పించుకోలేవు. మనసుపడి నాతో వుంటే జీవితాంతం కలిసి కమ్మని జీవితం గడుపుదాం. లేదా - నువ్వూ, ఆ సత్యవతి, నీతోబాటు వున్న ఊరకుక్కలు అందరూ చస్తారు! జాగ్రత్త!

—రాంప్రసాద్."

అని సంతకంచేసి వుంది. సంతకం రాంప్రసాద్ దే. ఈ తరం మరోసారి చదివేడు. ఫోటో మరిమరీ చూశాడు వరప్రసాదరావు. డిఫెరెన్స్ లేదు. రాంప్రసాద్.

రాంప్రసాద్ హత్యలు చేశాడా? బాధ్యతగల ఒక ఇన్స్పెక్టరాఫ్ పోలీస్ హత్యలు చేశాడా? ప్రభుత్వం రాం ప్ర సా ద్ సేవలను మెచ్చుకొని త్వరలో డి. యస్. పి. గా ప్రమోట్ చేయాలనుకొంటున్న ఆ రాంప్రసాద్ ఈ హత్యలు చేశాడా?

8

వేశ్య గృహంలో ఇన్స్పెక్టర్ రాంప్రసాద్ ఇద్దర్ని హత్యచేసిన వైనం తాటికాయంతలేని అక్షరాల్తో దిన పత్రికలన్నిటిలో కనిపించింది.

రాంప్రసాద్ కాఫీ తాగుతూ పేపర్లో వార్త చదివి, పాలమారాడు. కాఫీ గొంతుదిగలేదు.

"విజ్జీ!" అంటూ కేకేశాడు.

విజయ వచ్చింది. మంచినీళ్ళన్నట్లు సైగ చేశాడు. మంచినీళ్ళు తీసుకొచ్చింది. గడగడా తాగాడు.

"చూశావా!" అంటూ పేపరు చూపించాడు. విజయ పేపరు చదివింది. తన కళ్ళను తనే నమ్మలేకపోయింది. రాంప్రసాద్ ఫోటో అందులో వుంది. రాంప్రసాద్! వ్యత్యాసం లేదు.

"ఏమండీ, ఏమిటిది?"

రాంప్రసాద్ గుండె రాయి చేసుకున్నాడు. చిన్నగా పెదవులమీదుగా సన్నటి నవ్వు దొర్లిపోయింది. పేపరు మళ్ళీ ఒకసారి చదివేడు. నిజం! పేపర్లో స్వయంగా రాసివుంది తన ఫోటోతో సైతం.

ఫోన్ మ్రోగింది.

"హలో ...." ఫోనెత్తాడు రాంప్రసాద్.

"నేనూ వరప్రసాద్‌ని."

"నమస్తే సార్!"

"సారీ రాంప్రసాద్ ....నీ సిన్సియారిటీ నాకు తెలుసు. కాని ఎందుకిలా జరిగిందో నాకు అర్థంకాలేదు. ఇప్పటికీ పజిల్‌గానే వుంది. ఎవరో మినిష్టర్ లెవెల్‌లో ఇన్‌ఫ్లుయెన్స్ చేయించి ఈ ఫోటో, ఈ వార్త పత్రికల్లో వచ్చినట్లు నాకందిన వార్త! సత్యవతి వేశ్యాగృహంలో హత్య చేయబడ్డ ఇద్దర్ని నువ్వే చంపినట్లు తగిన ఆధారాలు, సాక్ష్యాలూ వున్నాయి. ఎనీవే డోంట్ వర్రీ—ఇలాంటి సమయాల్లోనే ధైర్యంగా వుండాలి!" ధైర్యం చెప్పేడు డి.యస్.పి.

"ఓ. కే. సార్!" అంటూ ఫోను పెట్టేశాడు. భారంగా నిట్టూర్చాడు. మొహం చెమట్లు పడుతుంది,

ఒకప్పుడు యిదే డి.యస్.పి. తనని గురించి ఉపన్యసిస్తూ "రాంప్రసాద్‌లాంటి యువకుడు సబ్ ఇన్స్పెక్టరుగా రావడం మన పోలీసు డిపార్టుమెంట్‌కే గర్వకారణం!" అని పొగిడిన సంఘటన కళ్ళముందు మెరిసింది.

మళ్ళీ ఫోను మ్రోగింది.

"హలో" చిరాగ్గా అడిగాడు రాంప్రసాద్.

"హలో ఫ్రెండ్. నేనూ గోపాల్రావుని, నీ క్లాస్‌మేట్‌ని" క్షణం ఆగాడు రాంప్రసాద్.

"హలో....ఏమిటి విషయం!" తాపీగానే అడిగాడు.

"నేను పేపర్లో చూసింది నిజమేనా?"

"నీకు తెలీదా?"

"నా కెలా తెలుస్తుంది!"

"మీకు మినిష్టర రికమండేషన్సు, పరపతి పుష్టిగా వున్నాయని మీరే చెప్పేతుకదా. యిలాంటి విషయాలు ముందుగా తెలిసేవి మినిష్టర బంధువులకే!"

"హ....హ....హ....భలే జోక్ జోస్తూన్నావయ్యా బాబూ" కలకల నవ్వాడు గోపాల్రావు. ప్రయత్నంమీద భరించాడు రాంప్రసాద్.

"సరేగాని, నువ్వు వెంటనే బయలుదేరి రావాలి!" అన్నాడు గోపాల్రావ్.

"ఎక్కడికి?"

"నా గెస్ట్‌హౌస్‌కి."

"ఎక్కడ గెస్టుహౌస్‌కి."

"మొన్న రాలేదూ. బొమ్మూరులో వున్న గెస్టుహౌస్‌కి. నీతో ముఖ్యమయిన విషయం మాట్లాడాలి."

"............"

"తప్పదు. నేనే నీతో ముఖ్యమయిన విషయం మాట్లాడాలి" అన్నాడు.

అరగంట తర్వాత రాజ్ మాత బొమ్మోరు గెస్టు హౌస్ ముందు ఆగింది.

గోపాల్రావు గ్లాస్కో లుంగీ చుట్టుకున్నాడు. గ్లాస్కో లాల్చీ లోపల్నుంచి వంద రూపాయిల నోట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"హల్లో రాం కమాన్!" అంటూ చేతులు చాచి రిసీవ్ చేసుకున్నాడు.

"ఏమిటి విషయం!" గంభీరంగా అడిగాడు రాం ప్రసాద్.

"అటా—ఏవిటోయ్. పవరు లేకపోయి గొంతు కఠినంగానే వుంది—" గోపాల్రావు జోక్.

రాంప్రసాద్ కళ్ళు ఎదురుగా వున్న అమ్మాయిమీద పడ్డాయి.

"ఎవరీమె?" అడిగాడు.

"సుశీల నీకు తెలీదా?" నవ్వుతూ అడిగాడు గోపాల్రావ్, రాంప్రసాద్‌ని.

"నాకు తెలీదు. యింతకుముందెప్పుడూ చూడలేదు." కంగుతిన్నాడు గోపాల్రావు.

"పోనీ నువ్వింతకుముందు చూశావా?" అడిగాడు సుశీలని. సుశీల క్షణం రాంప్రసాద్‌ని పరీక్షగా చూసింది.

"చూశాను!" అంది తలదించుకొని.

రాంప్రసాద్ షాక్ ఫీలయ్యాడు. గోపాల్రావు నోరావులించాడు.

"వాటీజ్ దిస్?" అని అరిచాడు.

"సుశీలా! నన్ను నీకు తెలుసా?" కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"తెలుసు!" అంది అలాగే చూస్తూ.

"ఎప్పుడు తెలుసు. ఎలా తెలుసు? నువ్వు నాటకమాడుతున్నావ్!" అరిచాడు రాంప్రసాద్.

"లేదండీ! మీరు మొదటిసారి మా యింటికి వచ్చినప్పుడు మీరు నేను కావాలని పట్టుబట్టారు గుర్తుందా! నాకు వీలుపడలేదు. మండిపడ్డారు. ఆ తరువాత ఒక ఉత్తరం కూడా రాశారు. మీ ఫోటో జతచేసి ఫైనల్ వార్నింగ్ యిస్తూ...."

"ఆ లెటరూ, ఫోటో నీ దగ్గరుందా?"

"వుంది!" వ్యానిటీ బాగ్ లోంచి తీసి యిచ్చింది.

రాంప్రసాద్ ఫోటో చూశాడు.

"ఈ ఫోటో.... ఈ ఫోటో నీకెలా వచ్చింది?"

"మీరే యిచ్చారు!"

"నో. యిది నా పర్సనల్ ఫోటో. బాలాజీ ఫోటో స్టూడియోలో తీయించాను రీసెంట్ గా. యిది మీ కెలా వచ్చిందో కనిపెట్టడం నాకంత కష్టమయింది కాదు!" అంటూ లెటరు చదవడం పూర్తి చేశాడు.

"రాం. కొంచెం ప్రశాంతంగా ఆలోచించరా. ఏమిటి దుడుకుతనం, యిప్పుడేం మునిగిపోయిందని? మనం స్నేహితులం. ఇలాంటి ఆపద సమయాల్లోనే ఒకరికొకరు ధైర్యం చెప్పుకోవాలి—"

"యు ఇడియట్—నా ఫ్రెండునని చెప్పుకొని మోసం చేసి, నాటకమాడి నీకు సానికొంపలకు సంబంధం పెట్టుకొని హత్యలుచేస్తావా? నీ ఇన్ ఫ్లుయెన్స్ ఉపయోగించి నా పేరు పేపర్లో వేయిస్తావా! నా ఫోటో

తీయిస్తావా! చూడు నిన్నేం చేస్తానో" అంటూ గొంతు పిసికి చంపబోయాడు.

సుశీల అడ్డంపడింది.

బలవంతంగా విడదీసింది.

"ఏమండీ! ఉద్రేకపడకండి! మీకీ విషయంలో నా నుండి పరిపూర్ణమైన సహకారం లభిస్తుంది!" అంటూ ప్రాధేయపడింది.

సుశీల రాంప్రసాద్ ని చూసినప్పటినుండి గమని స్తుంది. మాటలు—చూపులు—ప్రవర్తన అన్నిటిలోనూ తేడా కనిపిస్తుంది. సమ్ధింగ్ మోసం జరిగివుంటుందని గ్రహించింది.

రాంప్రసాద్ సుశీల మొహంలోకి చూశాడు.

సుశీల దీనంగా చూసింది.

"సుశీలా! ఏంటి—ఏమిటి నువు నాకు సహకరించా లనుకున్నది. టెల్ మీ!" అరిచాడు. రాంప్రసాద్ భయం కరంగా కనిపించసాగాడు. కళ్ళు చింతనిప్పుల్లా మెరిశాయి.

"మీరు నాతో మా యింటికి రండి! కొన్ని ఆధారాలు దొరుకుతాయి" అంది ఆశగా.

"అవును....రాంప్రసాద్! నేనూ నీ ఫ్రెండునేరా. నాకే పాపం తెలీదురా! పత్రికల్లో పేరు ఎలా వచ్చిందో, ఫోటో ఎలా అచ్చయిందో వివరాలు సత్యవతిని అడిగితే తెలుస్తాయి. పదరా, నీ విషయంలో ఎన్ని లక్షలు ఖర్చయినా లెక్కపెట్టను. నువ్వు నిర్దోషివని నిరూపించు కోవాలి!" అన్నాడు కంటతడిపెట్టి—

సత్యవతి యింటికేసి రాజ్ దూత్ పరుగుతీసింది.

ఆ వెనుక సుశీల, గోపాల్రావ్ జీపులో దూసుకు వెళ్ళారు.

9

"ఏదయినాసరే యిది మన పోలీసు డిపార్టుమెంటుకే భరించరాని అవమానం!" అన్నాడు డి. యస్. పి. సూర్యప్రకాశరావు.

"నోనో మిస్టర్ సూర్యం. రాంప్రసాద్ హంతకుడు కాదు. రాంప్రసాద్‌కి అతి త్వరలో డి.యస్.పి.గా ప్రమోట్ అయ్యే అవకాశాలున్నాయి. ఈ వార్త చాలామంది బిజినెస్ మాగ్నెట్‌లకు తెలుసు. రాంప్రసాద్ వాళ్ళ ఆటలు సాగనివ్వడని, ఎవ్వరో ఈ దారుణానికి తలపడ్డారు. రాంప్రసాద్ అలవాట్లు, సిన్సియారిటీ మనకు తెలియంది కాదు! ఈ విషయంలో— రాంప్రసాద్ నిర్దోషి అని నిరూపించడం విషయంలో మీరందరూ పూనుకోవాలి! మళ్ళీ రాంప్రసాద్ యూనిఫామ్‌లో మనకగ్పనిపించాలి. ఏమంటారు రఘునాధరావు గారు" అని సీనియర్ ఇన్స్పెక్టర్ని అడిగాడు వరప్రసాదరావు.

"ఏమో సర్! రాంప్రసాద్‌మీద అంత మంచి రిపోర్టు నా దగ్గర లేదు. ఆయనకీ అలవాట్లున్నాయనీ బిజినెస్‌మెన్‌తో టచెస్ వున్నాయనీ, డిబేచింగ్ హౌసెస్‌తో అండర్‌స్టేండింగ్ వుందనీ నాలుగయిదుసార్లు మన స్టాఫ్ అనుకుంటుండగా విన్నాను. ఏమండి సూర్యం గారు చెప్పరేం!"

"అవున్సార్! మీరు మంచివాళ్ళు. మీకు అందరూ మంచిగానే కనిపించవచ్చు. కాని రాంప్రసాద్ నిజ స్వరూపం మీకు తెలీదు. ఆయనకో ఫ్రెండున్నారు,

గోపాల్రావని లక్షాధికారి. అన్యాయాలు, అత్యా చారాలకు పెట్టింది పేరు. ఆయనకి రాంప్రసాద్ అండ- అలాగే స్మగ్లర్ మూర్తి దొరగారికి ఆరో ప్రాణం ఈ రాంప్రసాద్. అయితే తెలివిగా ఈ విషయాల్ని తొక్కిపెట్టి 'సిన్సియర్' అన్న పేరు తెచ్చుకున్నాడు. రాంప్రసాద్ మంచి నటుడు. ఎపుడు, ఎవరి దగ్గర.... ఎలా నటించాలో బాగా తెలుసు. మన స్టాఫ్‌లోనే కాదు, కొంతమంది బిజినెస్ మెన్ దృష్టిలోనూ 'రాం'కి చాలా బేడ్ నేమ్ వుంది!" అన్నాడు సూర్యం.

వెంటనే శేఠ్ చందన్‌లాల్‌కి ఫోన్ చేశాడు డి.యస్.పి.

"హలో.... చందన్‌లాల్ గారా! రాంప్రసాద్ మిమ్మల్ని ఈ మధ్య కలిశారా!"

"కలవలేదండీ. రెండు వారాల క్రితం కలిశారు. అర్జంటుగా యాభయ్‌వేలు కావాలన్నారు. ఇచ్చాను. తర్వాత కలవలేదు!"

"యాభయ్ వేలా! ఎందుకండీ!"

"ఎందుకంటా రేవిటండీ— పేరున్న పోలీసధికారులు మాలాంటోళ్ళ దగ్గర డబ్బు ఎందుకడుగుతారండీ!" కిలకిలా నవ్వాడు.

వరప్రసాద్ గుండెను దొలిచేసింది ఆ నవ్వు.

"ఏమంటారు సార్ చందన్‌లాల్ గారు!" అని అడిగాడు సూర్యప్రకాశ్. వరప్రసాద్ మాట్లాడలేదు. మౌనంగా తలదించాడు.

"ఎనీవే దిసీజ్ కాన్ఫిడెన్షియల్! ఒకే వృత్తిలో మనమందరమూ వుంటున్నాం. ఈ రోజు రాంప్రసాద్ కావచ్చు. రేపు సూర్యప్రకాశ్ కావచ్చు. ఎల్లుండి

రఘునాథన్ లేదా, నేనే కావొచ్చు. మనకి ఒకరిపట్ల ఒకరికి విశ్వాసం వుండాలి. ఒకరిలో వున్న మంచి మరొకరు పంచుకోవాలి!" అంటూ కళ్ళు అద్దుకున్నాడు.

10

రాంప్రసాద్‌ని చూడగానే సత్యవతికి గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. ప్రళయకాలరుద్రుడ్ని చూసినట్లనిపించింది.

"ఎ .... ఎ .... ఎవరు మీరు?" అంది సత్యవతి వొణుకుతూ.

"నీ ....నీకు — తెలీదూ...."

"నాకు తెలీదు!" వెన్నులోంచి వొణుకు పుట్టు కొస్తుంది సత్యవతికి.

"నే నే.... నే నే రాంప్రసాద్‌ని!" అడుగులో అడుగు ముందుకేసుకొంటూ నడిచాడు. బెల్టు విప్పేడు. సత్యవతి కళ్ళు చాకల్లా తిరుగుతున్నై.

"నువ్వు రాంప్రసాద్‌వి కాదు!"

"ఏమన్నావ్!"

"నువ్వు రాంప్రసాద్‌వి కాదు. రౌడీవి! అదు పంపించిన రౌడీవి! రాంప్రసాద్ యిలా వుండడు. యింత భయంకరంగా వుండడు!" అంది తడబడుతూ.

"మరెలా డి.యస్.పి.గారికి రిపోర్టు చేశావ్."

"ప్రాణ భయంతో."

"యిపుడు మాత్రం నీ ప్రాణాలు దక్కుతాయా!"

"మమ్మల్ని చంపకు! వాడు వేరు. మీరు వేరు!" బ్రతిమాలుకుంది. రాంప్రసాద్ కళ్ళు నిప్పులు కురి పిస్తున్నాయి. గోపాల్రావుకి గుండె మండింది.

"ఏయ్ రాక్షసీ! అన్యాయంగా ఒకరి నిందు జీవి

తంతో ఆడుకుంటావా!" గొంతు పిసికి చంపబోయాడు. రాంప్రసాద్ అడ్డుకున్నాడు.

"గోపీ! దాన్ని చంపకూడదు. యిదే సాక్ష్యం చెప్పాలి. ఎవరు....ఎవరు రాంప్రసాద్ ని....మీ ఇంటికి వచ్చిన ఆ రాంప్రసాద్ ని ప్రత్యక్షంగా చూసింది ఎవరు?" రాంప్రసాద్ మాట్లాడుతుంటే అందరికీ గుండె దడదడలాడింది. పెదవులు తడబడ్డాయ్.

"నేను...." అంటూ ముందుకొచ్చింది పుష్ప.

"నాలాగే వుంటాడా?" పుష్పని ఆపాదమస్తకం చూస్తూ ప్రశ్నించాడు.

"అవును!"

"ఆయన అలవాట్లు ఏవిటి? నువ్వు గమనించిన అలవాట్లు చెప్పగలవా?"

"నేను చెబుతాను!" అంటూ సుశీల ముందుకు వచ్చింది.

"చెప్పు! స్పష్టంగా చెప్పగలిగితేనే చెప్పు!" అని సుశీల కళ్ళల్లోకి తీక్షణంగా చూడసాగాడు.

సుశీలకి కంపనం బయలుదేరింది.

"ఆయన మీలా తీక్షణంగా చూడలేదు. క్షణక్షణానికి చూపులు మారుతూంటాయి. పాసింగ్ షో సిగరెట్ కాలుస్తాడు. పొగ పీల్చడు. ఏదయినా మాట్లాడేముందు, మాట్లాడిన తరువాత స్టయిల్ గా ముక్కుతో గాలి పీలుస్తాడు. ఒడ్డూపొడుగూ అచ్చు మీలాగే వుంటాడు. ఆయనకి ఎడమ కంటిలో పట్టి చూస్తే పుట్టుమచ్చ వుంటుంది. కాని రింగులాగా నుదురుమీదకి ఓ కర్ల్ వస్తుంది" అంది రాంప్రసాద్, సుశీల మొహంలోకి చూశాడు స్పష్టంగా.

అనుమానంలేదు. నిర్భయంగా తను అతనిలో చూసింది చెబుతుంది. ఆ వర్ణన మదన్‌కి సరిపోతుంది.

కళ్ళు మూసుకున్నాడు.

గతం తళుక్కుమంది.

• • •

"మీకు పదిలక్షలు యిస్తాను. ఈసారికి విడిచిపెట్టండి. యికముందు యిలాంటి పనులు చేయను."

మదన్ కాళ్ళమీద పడ్డాడు.

చుట్టూ పదిమంది అమ్మాయిలు—దీనంగా చూస్తున్నారు.

ఆ అమ్మాయిల్ని నేపాల్ పంపించడానికి సిద్ధంగా వున్న మదన్ 'రాం'కి దొరికిపోయాడు.

"టు నాట్ సెవెన్, త్రీ జీరో సిక్స్ వాళ్ళను సేఫ్‌గా మన స్టేషనులో విడిచిపెట్టి డి.యస్.పి.గారికి రిపోర్టు యివ్వండి!" అన్నాడు.

కానిస్టేబుల్స్ పదిమంది సుందరాంగుల్ని తీసుకెళ్ళారు. మదన్ అలే చూస్తూ వుండిపోయాడు. వేన్ కదిలి పోయింది.

"ఇన్స్‌పెక్టర్! వీళ్ళని అయిదు సంవత్సరాల క్రితం కొన్నాను. వీళ్ళమీద లక్షలు ఖర్చుపెట్టాను. అవతల ఈ రోజే పంపిస్తానని మాట యిచ్చాను. డబ్బు కూడా తీసుకున్నాను. పోనీ ఈ పాతిక లక్షలు నువ్వే తీసుకో! ఆ పిల్లల్ని నాకు వొదిలెయ్. ఈ రోజు 'హంసగీతి' షిప్‌లో వీళ్ళని పంపించేందుకు హెల్ప్ చెయ్! ప్లీజ్! అంటూ కాళ్ళమీద పడ్డాడు—మదన్.

"ఛీ ఛీ! రాస్కెల్!" అంటూ తన్నాడు.

మదన్ దెబ్బతిన్న పులిలా తిరగబడ్డాడు.

మొహంమీద ఓ గుద్దు గుద్దాడు. మదన్ ముక్కు

చిదిగిపోయి నెత్తురు కారుతోంది.

ఎగిరి గుండెలమీద తన్నబోయాడు మదన్. అలాగే కాళ్ళు వెనక్కి విరిచాడు. కాళ్ళతో మెడకు సంకెళ్ళు వేశాడు. నేలమీద మదన్ ఒక్కడే గిలగిలా కొట్టుకుంటున్నాడు.

రాంప్రసాద్ బయటికి నడిచాడు గర్వంగా.

"రేయ్.... నిన్నూ నీ జీవితాన్ని సర్వనాశనం చేస్తాను! అలా చేయకపోతే నా పేరు మదన్ కాదు!" అన్నాడు సంకెళ్ళు విడదీసుకుంటూ.

11

"హల్లో! 'హనీమూన్' హోటలా అది!" రాంప్రసాద్ ఫోన్ చేశాడు.

"అవునండీ!"

"రాంప్రసాద్ మీ హోటల్ కి వచ్చాడా!"

"యిప్పుడే తన ఫ్రండ్స్‌తో వచ్చి యన్. వి. తీసుకెళ్ళారండి!"

"దేనిలో వచ్చారు!"

"అంబాసిడర్ కార్లోనండి!"

"కారు నెంబరు చెప్పగలరా!"

"ఆయన సిన్సియర్ పోలీసాఫీసరండి బాబూ! ఆయన మీద మీకెందుకు ఆరాలు!" అంటూ ఫోను పెట్టేశాడు నారాయణరాజు. మళ్ళీ డయల్ చేశాడు చందన్‌లాల్ కి.

"హల్లో చందన్‌లాల్ గారా!"

"అవునండీ!"

"రాంప్రసాద్ వచ్చాడా!"

"యిపుడే వచ్చి వెళ్ళారండీ!"

"ఎందుకూ!"

"ఎందుకేమిటి బాబూ. మా ప్రాణం తీసేస్తున్నాడాయన. వారానికో పదివేలు వసూళ్ళు మొదలుపెట్టి నెలరోజులైంది!"

"ఎలా వచ్చారు!"

"వైట్ అంబాసిడర్‌లో."

"నెంబరు తెలుసా?"

"యం. యస్. వి. ఒకటి సున్న మూడు తొమ్మిది."

"థాంక్స్యూ!" ఫోను పెట్టేశాడు రాంప్రసాద్.

ఆఖరికి నెంబరుని కూడా డూప్ చేశాడన్న మాట. తన రాజ్‌దూత్ నెంబరు అదే—రాంప్రసాద్ పేరు చెప్పి యిలా యింకెన్ని మోసాలు చేశాడో. ఎన్ని అన్యాయాలు చేశాడో—

"గోపీ .... నాకు మెంటల్ వేకరింగ్ వుంది. నువు డ్రైవ్ చెయ్. హోటల్ హనీమూన్‌కి పద!" అన్నాడు రాంప్రసాద్ కారెక్కుతూ.

'హనీమూన్' ముందు కారాగింది.

కారులోనుండి రాంప్రసాద్, గోపాల్రావ్ దిగేరు.

పార్కింగ్ ప్లేస్‌లో యం. ఎస్. వి. 1039 వైట్ అంబాసిడర్ వుంది.

బార్ సెక్షన్‌లో కాబరే డాన్సు జరుగుతుంది.

రాంప్రసాద్ కళ్ళు 'మదన్'ని గురించి వెదుకుతున్నై.

ఒక మూలనుండి పాసింగ్ షో సిగరెట్ గుప్పుగుప్పుమంటూ పొగలు....ఆ పొగలమధ్య ఓ జత కళ్ళు లైట్ల వెలుగులో తళతళ మెరుస్తూ చాకుల్లా తిరుగుతున్నై. ఎడమ కంటిలో పుట్టుమచ్చ.

చుట్టూ పదిమంది గర్ల్ ఫ్రండ్స్.

నుదురుమీద వంకీల జుత్తు—

"మదన్!" అంటూ అరిచాడు రాంప్రసాద్.

డాన్స్ ఆగిపోయింది.

సింహంలా మదన్‌మీదకి దూకాడు.

గోపి తలుపులు మూసి, ఎవర్ని బయటికి పోనివ్వకుండా చేశాడు.

రాంప్రసాద్ వేషంలో వున్న మదన్ గుండెలమీద కూర్చున్నాడు, రాంప్రసాద్. మదన్ తడబడుతున్నాడు. తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. రాంప్రసాద్ మదన్ జుత్తు పీకాడు. విగ్గు వూడిపోయింది.

"నువ్వెవరో చెప్పరా!" చెంపలమీద ఒకటిచ్చాడు రాంప్రసాద్.

"రాం" అని ఏదో చెప్పబోయాడు.

అంతే గోపీ డొక్కలో ఒకటిచ్చాడు. "ఆ పేరు.... ఆ పేరు చెప్పడానికి కూడా నీకు అర్హత లేదురా!" అన్నాడు.

మదన్ పెదవులమీదుగా రక్తం ప్రవహిస్తోంది. రెండు పళ్ళు రాలిపోయాయి.

"చెప్పు! ఎందుకీ నాటకం ఆడుతున్నావో చెప్పు! నా పేరు చెప్పుకొని ఎన్ని హత్యలు చేశావో ఎన్ని అన్యాయాలు చేశావో చెప్పు!" కుదిపి గుంజుతూ అడిగాడు.

మదన్ నోరు విప్పలేదు.

రాంప్రసాద్ నుదురుమీద ఒకటిచ్చాడు. మదన్ నుదురు చిట్లిపోయింది. డొక్కలో తన్నాడు. గింగుర్లు తిరిగిపోయాడు. గుండెల్లో పిడిగుద్దు గుద్దాడు.

రాంప్రసాద్ కాళ్ళమీద పడిపోయాడు.

"రాంప్రసాద్ గారూ! నన్ను క్షమించండి!" అంటూ.

12

"చెప్పు....నిజం ఏమిటో వివరంగా చెప్పు!" డి. యస్. పి. ముందు పడేశాడు, మదన్—మదన్ ప్రయోగించిన విగ్గుని టేబుల్ మీద వుంచాడు రాంప్రసాద్.

అందరి చూపు మదన్ మీదనే వుంది.

"సార్! నన్ను క్షమించండి. నేను మోసం చేశాను. అమ్మాయిల్ని తార్చాను. హత్యలు చేశాను. అమ్మకం సాగించాను. యివన్నీ నేను కావాలని చేయలేదు. నా వెనుక ఒక వ్యక్తి వున్నాడు. అతడే వీటన్నిటికి బాస్. ఆయన చేయమంటే చేశాను!" అన్నాడు రొప్పుతూ.

"ఎవరు ఆయన?"

"ఇన్స్పెక్టర్ సూర్య...." అంటుండగా కర్టెన్ చాటున రివాల్వర్ పేలింది. మదన్ గుండెల్లో దూసుకుపోయింది.

వెంటనే పిస్తోలు సౌండ్ వచ్చినకేసి పేల్చాడు రాంప్రసాద్.

"అమ్మా" అంటూ అవతలి వ్యక్తి పడిపోయాడు.

అతడు ఇన్స్పెక్టర్ సూర్యప్రకాశ్. చెయ్యికి గాయమయింది. రివాల్వర్ అల్లంతదూరంలో పడింది. ధారాపాతంగా రక్తం ప్రవహిస్తోంది. వరప్రసాదరావు రివాల్వర్ అందుకున్నాడు.

"యూ....యూ....యూ.. మిస్టర్ సూర్యప్రకాశ్! యు హావ్ డన్ ది జాబ్" అన్నాడు.

"క్షమించండి సార్! నేనే చేశాను. రాంప్రసాద్

మొదట్నుంచీ నాకు అన్నివిధాలా అడ్డు తగులుతూనే వున్నాడు. నా కళ్ళముందు ట్రైనింగయ్యాడు. నా కళ్ళ ముందు సబ్ ఇన్స్పెక్టరయ్యాడు. నా కళ్ళముందే రేపు డి.యస్.పి. కాకూడదు. వాడికి నేను సెల్యూట్ పెట్టే దురదృష్టం కలక్కూడదు. అందుకే....అందుకే, వాడి అంతం చూడాలని కంకణం కట్టుకున్నాను. బాడ్ లక్. బ్రతికిపోయాడు!" భారంగా నిట్టూర్చాడు సూర్యప్రకాశ్. కళ్ళల్లో విషజ్వాలలు కురుస్తున్నాయి.

డి. యస్. పి. వరప్రసాద్ క్షణం స్తబ్ధతగా వుండిపోయాడు. సూర్యప్రకాశ్ లేచి నిలబడ్డాడు.

"కమాన్ నన్ను అరెస్టు చేయండి!" అంటూ చేతులందించాడు.

సూర్యప్రకాశ్ కి సంకెళ్ళు వేశారు.

—:ఐ పో యిం ది:—